క్లుప్తంగా

'ఆదర్శ'లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మర్రిగూడ: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శివస్వరూపరాణి మంగళవారం తెలిపారు. బుధవారం దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ ఉన్నందున ఆసక్తి కలిగిన విద్యార్థులు నేరుగా పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కట్టంగూర్ : విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని కురుమర్తి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు చెనగోని నాగయ్య తన గేదెను గ్రామ శివారులో వ్యవసాయ పొలంలో మేపుతుండగా విద్యుత్ స్తంభం స్టే వైర్‌కు తగులుకొని విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

శాలిగౌరారం : విద్యుదాఘాతంతో గేదె మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని గురుజాల గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన కాశోజు కృష్ణకు చెందిన గేదె గ్రామ సమీపంలోని పంటపొలాల్లో మేతకు వెళ్లిన క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. మృతిచెందిన గేదె విలువ సుమారు రూ. 70 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నార్కట్‌పల్లి: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నార్కట్‌పల్లి మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన బొర్రిగల శ్రీనివాస్(45) మేదరి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం తాను నిర్వహిస్తున్న షాపు వద్దకు వెళ్లి వుడ్ కటింగ్ మిషన్‌తో వెదురు బొంగులు కట్ చేస్తుండగా కరెంట్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే 108 వాహనంలో కామినేని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య సాయినవ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.


పేలిన ట్రాన్స్‌ఫార్మర్.. నిలిచిన విద్యుత్ సరఫరా



చిట్యాలలో ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తున్న విద్యుత్ సిబ్బంది

చిట్యాల: పట్టణంలోని పదవ వార్డులోని పాత శివనేనిగూడెం రోడ్డులోని నివాస గృహాలకు విద్యుత్ సరఫరా అయ్యే ట్రాన్స్‌ఫార్మర్ సోమవారం రాత్రి అకస్మాత్తుగా పేలిపోయింది. దీంతో ఆ వార్డులోని పలువురు ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే స్పందించిన ఆ వార్డు కౌన్సిలర్ సిలివేరు మౌనిక శేఖర్ కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. అనంతరం నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

విద్యార్థులు తైక్వాండో నేర్చుకోవాలి



తైక్వాండో పోటీలో బెల్ట్స్ సాధించిన విద్యార్థులు

మిర్యాలగూడ : విద్యార్థులు చదువుతోపాటు తైక్వాండో(మార్షల్ ఆర్ట్స్)లో తైక్వాండో నేర్చుకోవాలని శాంతినికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ లీమా మేరీ అన్నారు. దామరచర్ల మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో గోలి రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు తైక్వాండోలో శిక్షణ ఇవ్వగా మంగళవారం విద్యార్థులకు కలర్ బెల్ట్ శిక్షణ ఇచ్చారు. పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ, తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎ.ప్రవీణ్‌కుమార్‌లు 25 మంది విద్యార్థులకు కలర్‌బెల్ట్స్ ప్రశంసాపత్రాలను అందజేశారు.

క్రీడాకారిణికి సత్కారం



సాయి జశ్వంతిని సత్కరిస్తున్న హరికృష్ణ

చిట్యాల: చిట్యాల మండలంలోని వట్టిమర్తి గ్రామానికి చెందిన క్రీడాకారిణి నెక్కంటి సాయి జశ్వంతి ఇటీవల జాతీయ స్థాయి త్రో బాల్ పోటీలకు ఎంపికయ్యింది. ఆసరా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ మంగళవారం సాయి జశ్వంతిని శాలువతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు గంగాపురం రాము, బోజరాజు, శంకుతల తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీదే ఆధిక్యం

- అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే మెజార్టీ
- పార్లమెంట్ ఎన్నికల్లో పుంజుకున్న బీజేపీ
- మూడో స్థానానికి పడిపోయిన బీఆర్‌ఎస్



నల్లగొండలో ఓట్లు లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది

నల్లగొండ: నల్లగొండ నియోజక వర్గంలో పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. గత నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి 54,332 ఓట్ల మెజార్టీ వచ్చింది. ప్రస్తుతం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డికి 53,179 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇందులో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కలుపలేదు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వచ్చిన మెజార్టీతో సమానంగా రఘువీర్‌రెడ్డికి కూడా ఓట్లు వచ్చాయి. నల్లగొండ నియోజక వర్గంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓట్లు చెక్కు చెదరలేదు.

రెండో స్థానంలో బీజేపీ

గత అసెంబ్లీ ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచిన బీజేపీ ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచింది. బీఆర్‌ఎస్ పార్టీ మూడో స్థానానికి పడిపోయింది. బీజేపీ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డికి ప్రస్తుతం నల్లగొండ నియోజకవర్గంలో 54,675 ఓట్లు రాగా బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి 23, 801 ఓట్లు మాత్రమే వచ్చాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో 3వ స్థానంలో ఉన్న బీజేపీ పార్లమెంట్ ఎన్నికలు వచ్చే సరికి అనూహ్యంగా పెరిగి నల్లగొండ నియోజక వర్గంలోనే కాదు పార్లమెంట్ నియోజక వర్గంలో కూడా రెండో స్థానంలో నిలిచింది. బీఆర్‌ఎస్ మాత్రం గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డికి 53,073 ఓట్లు రాగా ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల్లో భూపాల్‌రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డికి నల్లగొండ నియోజకవర్గంలో కేవలం 23,801 ఓట్లు మాత్రమే వచ్చాయి. అంటే బీఆర్‌ఎస్ ఓట్లన్ని బీజేపీ వైపు మళ్లాయి. మహిళలు, యువత బీజేపీ వైపు మళ్లడంతో బీజేపీ అనూహ్యంగా పుంజుకుంది. కాంగ్రెస్ మాత్రం చెక్కు చెదరకుండా తన ఓట్లు తను పదిలంగా ఉంచుకుంది.

నకిరేకల్‌లో తగ్గిన ఆధిక్యం

నకిరేకల్ : ప్రస్తుత పార్లమెంట్ భువనగిరి నియోజకవర్గం ఫలితాల్లో నకిరేకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఇక్కడ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలో హోరా హోరీగా గతంలో తలపడినప్పటికీ ఈ ఎంపీ ఎన్నికల్లో మూడో స్థానానికి పడిపోయింది. ఇక క్యాడర్ అంతంత మాత్రంగానే ఉన్న బీజేపీ రెండవ స్థానంలోకి దూసుకవచ్చింది. నకిరేకల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డికి పోస్టల్ బ్యాలెట్ కాకనే 37,683 ఓట్ల ఆధిక్యాన్ని ఇచ్చింది. కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డికి 96914 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేషకు 21,377 ఓట్లు, బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌కు 59231, సీపీఎం అభ్యర్థి జహంగీర్‌కు 7381 ఓట్లు వచ్చాయి. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో నకిరేకల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన వేముల వీరేశంకు 1,33,540 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన చిరుమర్తి లింగయ్యకు 64701 ఓట్లు వచ్చాయి. గడిచిన ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 68,839 లీడ్ రాగా ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డికి 37,683 లీడ్ లభించింది.

'మునుగోడు'లో స్పష్టంగా..

చౌటుప్పల్ : భువనగిరి పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఘన విజయం సాధించారు. అందుకుగాను మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి 53706ఓట్ల మెజార్టీ లభించింది. గత 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి 119624ఓట్లు, అప్పటి బీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి 79034ఓట్లు, బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డికి 22319ఓట్ల చొప్పున వచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డిపై 40590ఓట్ల మెజార్టీతో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విజయం సాధించారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో మరో 8922ఓట్లు అదనంగా వచ్చాయి. మొత్తంగా నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి 1,08667ఓట్లు లభించాయి. బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌కు 54961ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేష్ 35660ఓట్లు సాధించి మూడో స్థానానికి పరిమితమయ్యాడు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

శాలిగౌరారం: శాలిగౌరారం–గురజాల ప్రధానరోడ్డు వెంట రామగిరి గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు మంగళవారం అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంపచెట్లు అల్లుకుపోవడంతో పాటు హెడ్‌ఫ్యూజ్ పోవడంతో నెలరోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిన ఘటనపై మంగళవారం నెల రోజులుగా నిలిచిన విద్యుత్ సరఫరా అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకుపోయిన కంపచెట్లను తొలగించి తెగిపోయిన హెడ్‌ఫ్యూజ్‌ను వేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తొలగించిన కంపచెట్లు

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రామగిరి(నల్లగొండ): అప్పుల బాధతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. తిప్పర్తి మండలంలోని మర్రిగూడెం గ్రామానికి చెందిన పోకల సందీప్(34) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత కొన్ని నెలలుగా అనారోగ్యంగా ఉండడంతో చికిత్స నిమిత్తం అప్పు చేశాడు. అప్పు తీర్చే మార్గం లేక మనస్థాపం చెంది ఈనెల 2వ తేదీన రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మంగళవారం మృతుడి భార్య వాసవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

తిప్పర్తి మండలంలోని మర్రిగూడెం గ్రామానికి చెందిన పోకల సందీప్ కుటుంబానికి అండగా ఉంటామని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. మర్రిగూడెం గ్రామానికి చెందిన పోకల సందీప్ అప్పుల బాధతో సోమవారం ఆత్మహత్య చేసుకోవడంతో ఆయన మృతదేహాన్ని మంగళవారం సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పుచ్చకాయల నర్సిరెడ్డి, తిప్పర్తి మండల కార్యదర్శి మన్నెం భిక్షం, సీఐటీయూ మండల కన్వీనర్ భీమగాని గణేష్ అకిటి లింగయ్య శశిదర్ నరేష్ పాల్గొన్నారు.

ఎస్పీ బాల సుబ్రహ్మణ్యానికి ఘన నివాళి

రామగిరి(నల్లగొండ): ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం మృతి సంగీత ప్రపంచానికి తీరని లోటు అని ఎన్జీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు కవి డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య అన్నారు. సిలివేరు సాహితీ కళాపీఠం ఆధ్వర్యంలో మంగళవారం ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం జయంతి వేడుకలను ఎన్జీ కళాశాలలో నిర్వహించారు. బాల సుబ్రహ్మణ్యం చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సిలివేరు లింగమూర్తి, డాక్టర్ సాగర్ల సత్తయ్య, దాసరి లింగస్వామి, యర్ర దేవదాసు, చొల్లేటి నరసింహ, దొంత శ్రీనివాస రావు పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించిన శాలిగౌరారం వాసి



కిరణ్ కుమార్‌రెడ్డి

శాలిగౌరారం: మారుమూల మండలమైన శాలిగౌరారం పేరు తొలిసారిగా పార్లమెంట్ రికార్డుల్లో నమోదు కానుంది. మండలానికి చెందిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్‌పార్టీ ఎంపీ అభ్యర్థిగా భువనగిరి స్థానం నుంచి పోటీలో నిలిచి భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన వేముల వేరేశం 2014, 2023లో నకిరేకల్ ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర శాసనసభలో అడుగు పెట్టి చరిత్ర సృష్టించగా పార్లమెంట్‌లో అడుగుపెట్టిన ఘనత దశాబ్దాల చరిత్రలో మండలంలో ఎవ్వరికి సాధ్యపడలేదు. తొలిసారిగా మండలకేంద్రానికి చెందిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చరిత్ర సృష్టించారు. తన రాజకీయ జీవితంలో మొట్ట మొదటిసారిగా ప్రజాస్వామ్యబద్ధంగా పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు.

నీట్ ఫలితాల్లో 'జాస్రిత' ప్రతిభ



ఆఫ్రా ముస్కాన్



అబ్దుల్ రహ్మాన్

రామగిరి(నల్లగొండ) : నీట్ ఫలితాల్లో నల్లగొండ పట్టణంలోని జాస్రిత అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. అకాడమీకి చెందిన ఆఫ్రా ముస్కాన్-532, అబ్దుల్ రహ్మాన్-511, నిశాత్ ఫాతిమా-506, ఫైజా ఆఫ్షీన్-501, సౌజన్య-496, ఫహాద్-475, జిక్రా-475, మనస్విని-473, అనశారా-462, మైథిలి-457, అక్షర-444, శివాని-444, మారియా-441 మార్కులు సాధించారు. లూబనా అంజుం-432, వైష్ణవి-431, సౌమ్య-430, నిత్యశ్రీ-430, ఆఫియా-425, అర్షియా-422, వర్షిత-421, సానియా-417, అర్పిత శ్రీ-412 బృంద-412, అనువర్షిక-407, అర్చన-397 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విదత్యార్థులు, వారి తల్లి తండ్రులను, అధ్యాపక బృందం అభినందించింది.

పాలిసెట్‌లో ఉత్తమ ర్యాంకులు

చిట్యాల: మండలంలోని నేరడ గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన పలువురు విద్యార్థులు పాలిసెట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు ఆ పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం తెలిపారు. ఆ పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసిన కొన్నె హన్సిక ఎంపీసీ విభాగంలో 120 మార్కులకుగాను 107 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 536వ ర్యాంకు, కందగట్ల కీర్తన 101 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 1056 ర్యాంకు, ఎంబీపీసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 778వ ర్యాంకు, పొట్టబత్తిని ఫణిశ్రీ 101 మార్కులతో 1095వ ర్యాంకు, ఎంబీపీసీ విభాగంలో 855వ ర్యాంకు సాధించారు. వీరితో పాటుగా పాఠశాలకు చెందిన ఐతరాజు పూజ, వరికుప్పల స్వాతిక, ఐతపాక శ్రీరామ్, రూపని రాంచరణ్, లింగస్వామి, సింహాచలం సైతం ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మంచినీటి ట్యాంకుల చుట్టూ ప్రహరీలు

- రక్షణ చర్యలకు శ్రీకారం చుట్టిన నీలగిరి మున్సిపాలిటీ
- ట్యాంక్‌పై లాక్ సిస్టమ్ ఏర్పాటుపై యోచిస్తున్న అధికారులు



ట్యాంకు చుట్టూ పిచ్చి మొక్కలు, కంప చెట్లను తొలగిస్తున్న సిబ్బంది, పరిశీలిస్తున్న కమిషనర్

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని నాలుగు వార్డులకు తాగునీటిని సరఫరా చేసే నీటి ట్యాంక్‌లో మృతదేహాన్ని గుర్తించిన మున్సిపల్ అధికారులు మరోమారు ఇలాంటి ఘటనలకు తావులేకుండా రక్షణ చర్యలకు శ్రీకారం చుట్టబోతోంది. పాతబస్తీ ప్రాంతానికి చెందిన పలువురు యువకులు హిందూపూర్ మంచి నీటి ట్యాంక్ వద్ద గంజాయి పీలుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇకనుంచి మంచి నీటి ట్యాంకుల వద్దకు ఎవరూ రాకుండా ఉండేందుకు వాటి చుట్టూ ప్రహరీ నిర్మించాలని మున్సిపల్ అధికారులు భావిస్తున్నారు. అదేవిధంగా ట్యాంక్ దగ్గర గది కూడా నిర్మించి, అవసరమైతే వాచ్‌మన్‌ను కూడా పెట్టే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఈ నెలలోనే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రహరీల నిర్మాణానికి అనుమతి తీసుకోనున్నారు. అదేవిధంగా అన్ని నీటి ట్యాంకులపై ఐరన్ షీట్ పెట్టి లాక్ సిస్టమ్ అమర్చాలని యోచిస్తున్నారు.

గంజాయి పీల్చేందుకు అడ్డాలుగా పలు కాలనీలు..

నల్లగొండ మున్సిపాలిటీకి చెందిన పలు తాగు నీటి ట్యాంక్‌ల వద్ద వాచ్‌మన్‌లు లేకపోవడంతో అక్కడి చెట్ల కింద కూర్చొని పలువురు గంజాయి పీలుస్తున్నట్లు మున్సిపల్ అధికారుల దృష్టికి వచ్చింది. మున్సిపల్ సిబ్బంది వారిని గుర్తించి మందలించే ప్రయత్నం చేసినా వారిపై దూషణలకు దిగుతున్నట్లు తెలిసింది. నల్లగొండ పట్టణంలోని పానగల్ రోడ్‌లో ఫ్లెఓవర్ దగ్గర, రాక్‌హిల్స్ కాలనీ సమీపంలో, అద్దంకి రోడ్‌లోని నంద్యాల నరసింహారెడ్డి కాలనీ, రాంనగర్, మహిళా ప్రాంగణం, పాతబస్తీ ప్రాంతంలో మూడు చోట్ల, బీటీఎస్, హైదర్‌ఖాన్ గూడ, హైదరాబాద్ రోడ్‌లోని ఓ ప్రాంతంలో పలువురు యువకులు విచ్చలవిడిగా గంజాయి పీలుస్తున్నారని సమాచారం. గంజాయి మత్తుకు బానిసైన యువత పట్టణంలో చిల్లర గొడవలకు కారణమవుతున్నారు.

ట్యాంకు చుట్టూ చెట్ల తొలగింపు

నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ హిందూపూర్‌లో మున్సిపాలిటీకి చెందిన మంచి నీటి ట్యాంక్ చుట్టూ పిచ్చి మొక్కలు, కంప చెట్లను మంగళవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. అనంతరం కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ మాట్లాడుతూ మంచినీటి ట్యాంక్‌ను ఇప్పటి వరకు రెండు సార్లు శుభ్రం చేయించినట్లు తెలిపారు. ట్యాంక్ ద్వారా వెళ్తున్న వార్డుల ప్రజలకు ట్యాంకర్ల ద్వారా మంచి నీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. నేడు కూడా ట్యాంక్‌ను మరోసారి శుభ్రం చేస్తామని, గురువారం నుంచి ట్యాంక్ ద్వారా తాగు నీటిని అందిస్తామన్నారు. మంచి నీటి ట్యాంక్‌ల వద్ద ఎలాంటి ఆగడాలకు చోటు లేకుండా అన్ని రక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు చోరీ

త్రిపురారం : మండలంలోని నీలాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఘంటారావు క్యాంపులో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని ఆయిల్, కాపర్ వైర్‌ను దొంగిలించారు. మంగళవారం ఉదయం స్థానికులు గుర్తించి విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. సుమారు రూ. 3 లక్షల నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఆరు నెలలుగా పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతుండడంతో విద్యుత్ శాఖకు తీవ్రంగా నష్టం జరుగుతోంది. పోలీసులు రాత్రి సమయంలో నిఘా ఉంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సంబరాలు



మునుగోడు అంబేడ్కర్ చౌరస్తాలో బాణసంచా కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు



మర్రిగూడలో సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు



నకిరేకల్ : కిరణ్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేల్



శాలిగౌరారం: సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు



నార్కట్‌పల్లి : కొబ్బరికాయలు కొడుతున్న వేణు

నకిరేకల్ : ఎన్నికల ఫలితాల సందర్భంగా నకిరేకల్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశం తన క్యాంపు కార్యాలయంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేసి వీక్షించారు. ఎంపీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపి సత్కరించారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల హర్షం

చిట్యాల: భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం సాధించటంతో చిట్యాలలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి విజయోత్సవ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, కౌన్సిలర్‌లు బెల్లి సత్తయ్య, కోనేటి కృష్ణ, నాయకులు ఎస్‌కె.ఇబ్రహీం, మేడిశెట్టి ఉమాశంకర్, ఏర్పుల పరమేష్, కుక్కల మోహన్, బోడ స్వామి, దేశపాక రాజేష్, సిలివేరు శేఖర్, కోసనం అశోక్ పాల్గొన్నారు.

కట్టంగూర్‌లో..

కట్టంగూర్ : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందటం పట్ల ఆ పార్టీ నాయకులు మంగళవారం మండలంలోని అయిటిపాముల, కట్టంగూర్, కల్మెరతో పాటు పలు గ్రామాల్లో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో బాణసంచా కాల్చి స్వీటు పంపిణీ చేశారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

మునుగోడు: పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో భువనగిరి పార్లమెంట్ స్థానం నుంచి భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపొందడంతో ఆ పార్టీ నాయకులు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చడంతో పాటు పలువురికి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్వాయి జితేందర్‌రెడ్డి, మిర్యాల వెంకన్న, సాగర్ల లింగస్వామి, బొల్లం వెంకన్న, ఆర్లేళ్ల సైదులు, చిలువేరు సుదర్శన్, బొల్లం వెంకన్న, బొడ్డు యాదయ్య గౌడ్, రావిరాల కుమార స్వామి, దుబ్బ రవి పాల్గొన్నారు.

మర్రిగూడలో..

మర్రిగూడ: భువనగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి 2లక్షల పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలుపొందడం పట్ల మర్రిగూడ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. మండల వ్యాప్తంగా 7926 ఓట్ల మెజారిటీ కాంగ్రెస్ అభ్యర్థికి లభించింది. ఈ ఎన్నికకు ఇన్‌చార్జిగా వ్యవహరించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితోనే ఇంత మెజారిటీ సాధ్యమైందని పలువురు ఎమ్మెల్యేను అభినందిస్తున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, పగడాల యాదయ్య, మహేశ్వరం సతీష్, పల్లె యాదయ్య, షర్ఫొద్దిన్, పగడాల లింగయ్య, సిలివేరు చంద్రయ్య, గొట్టిముక్కల దేవేందర్, ఎడ్ల ముత్తయ్య, వట్టిముక్కల ప్రకాశ్, రమావత్ శ్రీనునాయక్, సిరిపంగి శ్రీనివాస్, గిరి, మల్లేష్, రాములు, సత్తయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

చండూరులో..

చండూరు(గట్టుప్పల్) : భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపొందడంతో ఆ పార్టీ శ్రేణులు మంగళవారం మండల కేంద్రంలో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నామని జగన్నాథం, సామల యాదయ్య,చెరుపల్లి అంజనేయులు, నామని బుచ్చయ్య,కోటయ్య తదితరులు ఉన్నారు.

నాంపల్లి: భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపును హర్షిస్తూ ఆ పార్టీ నాయకులు మంగళవారం మండల కేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పానగంటి వెంకటయ్య, చత్రపతి, ఈద శేఖర్, విరమళ్ల నాగరాజు, పన్నాల మల్లయ్య, గాదేపాక యాదయ్య, రమేష్, రాములు తదితరులు ఉన్నారు.

శాలిగౌరారంలో..

శాలిగౌరారం: భువనగిరి పార్లమెంట్ మెంబర్‌గా కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు సాధించడం పట్ల మండలకేంద్రంలో మంగళవారం సాయంత్రం ఆ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద బాణసంచాలు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు చామల మహేందర్‌రెడ్డి, చాడ సురేశ్ రెడ్డి, చామల జయపాల్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, గోదల వెంకట్‌రెడ్డి, బొడ్డు నగేశ్, గూని వెంకటయ్య, ననుబోతు అంజయ్య, సుల్తాన్ యల్లయ్య, వేముల కిరణ్‌కుమార్, కంది సైదులు, మహేశ్, కడారి అంజయ్య పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడికి మొక్కు చెల్లింపు

నార్కట్‌పల్లి : భువనగిరి లోక్ సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడాన్ని హర్షిస్తూ ఆయన అభిమాని పర్వతం వేణు నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్లపాటి వసంత్, ఊటుకూరి శ్రవణ్‌కుమార్, నామ భరత్ తదితరులు ఉన్నారు.



చిట్యాల: విజయోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



కట్టంగూరు : కల్మెరలో సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు



గట్టుప్పల్ మండల కేంద్రంలో సంబరాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

వేగంగా బ్రిడ్జి నిర్మాణ పనులు

శాలిగౌరారం: శాలిగౌరారం బస్టాప్ నుంచి రామగిరి శివారు వరకు 2.1 కిలోమీటర్ల డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సింగిల్ రోడ్డుగా ఉన్న శాలిగౌరారం–గురజాల ప్రధాన ఎండీఆర్(మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్డు) ఆర్‌అండ్‌బీ రోడ్డును రూ.5 కోట్ల వ్యయంతో డబుల్‌రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నారు. శాలిగౌరారం బస్టాప్ సమీపంలో ఉన్న సింగిల్ రోడ్డు లోలెవల్ పైపు బ్రిడ్జి తొలగించి డబుల్ రోడ్డు బాక్స్ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. బాక్స్‌బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. బ్రిడ్జి నిర్మించే స్థలం లోతట్టు ప్రాంతం కావడంతో జాలు నీటితో పనులకు ఆటంకం కలుగుతోంది. శాలిగౌరారం ప్రాజెక్టు కింద వానాకాలం పంటకు నీటిని విడుదల చేయకముందే బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేసేలా అధికారులు, రోడ్డు నిర్మాణ సంస్థ పనులను చేపడుతున్నారు.



శాలిగౌరారం : నిర్మాణంలో ఉన్న డబుల్ రోడ్డు బాక్స్‌బ్రిడ్జి